

సెంట్రల్ జైలులోకి వెళుతూ.. తర్వాత బయటకు వస్తూ.. (ఫైల్ ఫొటోస్)

రికార్డుల మోత!

- ఎన్నికల ఫలితాల్లో 'మెజార్టీ' రికార్డులు
- గత ఎన్నికల్లో ఎప్పుడూ రానంతగా నమోదు
- ఉమ్మడి 'తూర్పు'లో ఏడు నియోజకవర్గాల్లో 50వేలకుపైనే దాటేసిన ఆధిక్యతలు
- కాకినాడ రూరల్‌లో అత్యధికంగా పంతం నానాజీకి 72వేలపైనే మెజార్టీ
- ఆ తర్వాత రాజమహేంద్రవరం సిటీ 71వేలు, పిఠాపురంలో 70వేలపైమాటే
- రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేటల్లోనూ రికార్డుల మోతే
- ఈ నియోజకవర్గాల్లో ఐదేళ్లలో శృతిమించిపోయిన వైసీపీ అరాచకాలు, అక్రమాలు
- అధికారం అండతో యథేచ్ఛగా దోపిడీ, దౌర్జన్యాలు, బూతుల దండయాత్రలు
- చంద్రబాబును జైలుపాలు చేయడంతో వైసీపీని ఈడ్చికొట్టిన రాజమహేంద్రవరం ప్రజలు
- కాకినాడ సిటీ, కొత్తపేటల్లో అవినీతికి వైసీపీ ఎమ్మెల్యేలపై జనంలో తీవ్ర తిరుగుబాటు
- సీఎం జగన్ సామాజికవర్గం సాకుతో ఐదేళ్లుగా వీరిద్దరి అరాచకాలపై జనాగ్రహం


ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు టీడీపీ కూటమికి ఓట్ల వరద సృష్టించారు. అవినీతి, అక్రమాలతో నిండా మునిగిపోయి ప్రజల స్వేచ్ఛను హరించేసిన వైసీపీని ఉతికి ఆరేశారు. ఈవీఎంలపై కసిగా నొక్కి ఫ్యాన్‌ను భూస్థాపితం చేశారు. దీంతో టీడీపీ, జనసేన నుంచి పోటీచేసిన అభ్యర్థులు కనివినీ ఎరుగని మెజార్టీలతో నియోజకవర్గాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో ఇది వరకు ఎమ్మెల్యేలుగా నెగ్గిన అభ్యర్థుల గత రికార్డులు సైతం తుడిచిపెట్టుకుపోయాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులంతా వేలాది ఓట్ల మెజార్టీలతో గెలుపొందారు. కానీ వీటిలో ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్లు వైసీపీపై ఒకరకమైన కసి, కోపంతో కూటమికి ఓట్ల వరద పారించారు. మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే అంతుచిక్కనంత అనూహ్య మెజార్టీలు కట్టబెట్టారు. అంతా కూడబలుక్కునట్టు ఉప్పెనలా కదిలి ఓట్లేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ రూరల్, రాజమహేంద్రవరం సిటీ, పిఠాపురం, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ సిటీ, కొత్తపేట, జగ్గంపేట నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ఏకంగా 50 వేల నుంచి 72వేలకుపైగా మెజార్టీలు దక్కించుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే గత ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గాల నుంచి నెగ్గిన ఎమ్మెల్యేలకు ఈ స్థాయి మెజార్టీలు రాలేదు. కానీ ఇప్పుడు ఏ నియోజకవర్గాల్లోనూ లేనివిధంగా ఇక్కడే సరికొత్త రికార్డు ఆధిక్యతలు రావడానికి కారణాలేమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



పంతం నానాజీ (జనసేన) మెజారిటీ : 72,040



ఆదిరెడ్డి శ్రీనివాస్ (టీడీపీ) మెజారిటీ : 71,404



పవన్‌కల్యాణ్ (జనసేన) మెజారిటీ : 70,279



బుచ్చయ్యచౌదరి (టీడీపీ) మెజారిటీ : 64,090



వనమాడి కొండబాబు (టీడీపీ) మెజారిటీ : 56,573



బండారు సత్యానందరావు (టీడీపీ) మెజారిటీ : 56,479



జ్యోతుల నెహ్రూ (టీడీపీ) మెజారిటీ : 52,676

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అధికార వైసీపీ నేతలు ఈ అయిదేళ్లలో అధికారం అడ్డుపెట్టుకుని సాగించిన దురాగతాలు, బెదిరింపులే ఈ స్థాయిలో ప్రజలు స్పందించడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆ కోపమే కూటమి అభ్యర్థులకు ఓట్ల వర్షం కురిపించిందనే చర్చ జరుగుతోంది. కాకినాడ రూరల్‌లో మాజీ మంత్రి కన్నబాబు అధికారం అండతో అవినీతితో రెచ్చిపోయారు. కుటుంబం మొత్తం నియోజకవర్గాన్ని జుర్రేశారు. దీంతో ఇక్కడ అవినీతిపై ప్రజలకు వినుగొచ్చేసింది. ప్రతి పనికీ రేటు నిర్ణయించేసి సదరు నేత కోట్లకు పడగలెత్తారు. అలాగే ఇక్కడ ఎన్నికల ప్రచారం చేసిన పవన్ ఎమ్మెల్యే కన్నబాబు అవినీతిపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు డొక్కు సైకిల్‌పై తిరిగిన కన్నబాబు, ఇప్పుడు వెయ్యి కోట్లు సంపాదించారని ఆధారాలతో ఆరోపించారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పంతం నానాజీకి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా ఏకంగా 72వేలకుపైగా మెజార్టీ వచ్చేలా చేసింది. అటు రాజమహేంద్రవరం సిటీలో ఆదిరెడ్డి వాసు టీడీపీ నుంచి 71 వేలకుపైగా మెజార్టీతో నెగ్గారు. నిజానికి రాజమండ్రి సిటీలో, రూరల్‌లోనూ పోలింగ్ శాతం తక్కువ నమోదైంది. అయినాగానీ ఇక్కడ భారీ మెజార్టీలు వచ్చాయి. పోలింగ్ శాతం పెరిగితే ఇంకెంత మెజార్టీ వచ్చేదో మరి. ఇదో కొత్త చరిత్ర. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీ నుంచి ఆదిరెడ్డి భవానీ ఉన్నారు. కానీ అధికారంలో ఉన్నది వైసీపీ కావడంతో ఆ పార్టీ ఎంపీ భరత్ తన వ్యవహార శైలితో రాజమహేంద్రవరం ప్రజల్లో వైసీపీపై ఒకరకమైన ఏహ్యాభావం కలిగించేలా చేశారు. అవినీతి ఆరోపణలు, రెచ్చగొట్టే బూతులు, సాధ్యంకాని హామీలతో నవ్వులపాలయ్యారు. అలాగే ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జగన్ ప్రభుత్వం అరెస్టులు చేయడం, వారి వ్యాపారాలను దెబ్బకొట్టడం ప్రజల్లో ఆదిరెడ్డి కుటుంబంపై సానుభూతి పెంచింది. అన్నింటికీ మించి స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టైన చంద్రబాబును నెలల తరబడి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచడంతో ఇక్కడి ప్రజలు వైసీపీ అరాచకాలను నేరుగా చూశారు. దీంతో ఎన్నికల్లో ఓటుతో వైసీపీని కసితీరా చితక్కొట్టారు. రాజమండ్రి రూరల్ నుంచి కూటమి తరఫున టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి ఆయనకు ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మంత్రి వేణుకంటే 64,090 ఓట్లు మెజార్టీ లభించింది. 11సార్లు ఎన్నికల్లో పోటీచేసిన గోరంట్ల 7వసారి అసెంబ్లీకి ఎన్నికై మరో రికార్డు సృష్టించారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌ను ఓడించడానికి వైసీపీ పన్నని కుట్రలు, కుతంత్రాలంటూ లేవు. కడప నుంచి బృందాలు రావడం, కోట్లు కుమ్మరించడం ఇవన్నీ ప్రజల్లో వైసీపీపై అసహ్యాన్ని పెంచాయి. ఎన్నికల చివరి రోజు జగన్ సభ, ఎమ్మెల్యే అభ్యర్థి గీత ఏడుపు నటనలు జనంలో వైసీపీపై నిలువెత్తు కోపం పెంచాయి. ఇదంతా పవన్‌పై అక్కసుతోనే అని గ్రహించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా బుచ్చయ్యచౌదరి ఉన్నారు. కానీ ఇక్కడకు వైసీపీ అభ్యర్థిగా అవినీతిలో మునిగిపోయిన మంత్రి వేణు రామచంద్రపురం నుంచి బదిలీపై రావడం మైనస్‌గా మారిపోయింది. పైగా ఇక్కడ వైసీపీ సాగించని అవినీతి అంటూ లేకుండా పోయింది.

పార్లమెంటు అభ్యర్థులకూ భారీ మెజారిటీలు

ఇక పార్లమెంట్ కూటమి అభ్యర్థిగా గెలిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కూతురు దగ్గుబాటి పురందేశ్వరికి 2,39,139 ఓట్ల మెజార్టీ లభించింది. జిల్లాలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇంత మెజార్టీ లభించలేదు. గతంలో టీడీపీ ఎంపీగా గెలిచిన మాగంటి మురళీమోహన్ లక్షా 60వేల ఓట్లు సాధించి రికార్డు సాధించగా, పురందేశ్వరి ఆ రికార్డును కూడా బ్రేక్ చేశారు. అలాగే అమలాపురం పార్లమెంటు టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన గంటి హరీష్‌మాధుర్ (బాలయోగి)కి 3,42,196 ఓట్ల మెజారిటీ లభించింది. ఇది కూడా ఒక చరిత్రే. కాకినాడ పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు 2,29,491 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తానికి కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు స్థానాల నుంచి మెజారిటీల విషయంలో రికార్డుల మోత మోగించారు.

వారిద్దరి అరాచకం అంతా ఇంతా కాదు...

కాకినాడ సిటీ, కొత్తపేటల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, జగ్గిరెడ్డి ఇద్దరూ అవినీతికి నిలువెత్తు రూపాలుగా మారారు. ఈ అయిదేళ్లలో నియోజకవర్గాలను వీరిద్దరు పీల్చి పిప్పిచేసినంతగా మరెవరూ చేయలేదు. ఇసుక, మట్టి గ్రావెల్ దోపిడీలు, సెటిల్‌మెంట్లు, దందాలు, రౌడీయిజం, ప్రశ్నించే వారిపై కేసులు, దాడులతో ద్వారంపూడి, జగ్గిరెడ్డి చెలరేగిపోయారు. వీరిద్దరిదీ సీఎం సామాజికవర్గం కావడంతో తమకు ఎదురేలేదన్నట్టు వ్యవహరించారు. అయిదేళ్లలో వందల కోట్లు సంపాదించారు. ప్రజలకు ఏ చిన్నమేలు చేయకపోవడం ఒకెత్తయితే ప్రతి పనికి రేటుతో చెలరేగిపోయారు. వీటన్నింటితో విసుగెత్తిపోయిన ప్రజలు ఓటుతో చాచికొట్టారు. నియంతల్లా వ్యవహరిస్తున్న వీరిద్దరినీ ఓటుతో కసిదీరా కొట్టి టీడీపీ అభ్యర్థులకు అఖండ ఓట్ల మెజార్టీ కురిపించి తమ కోపం చల్లార్చుకున్నారు. జగ్గంపేటలో సైతం సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిబాబు అవినీతికి హద్దుల్లేకుండా పోయింది. దీంతో ఇక్కడ కూడా ఆ పార్టీని నామరూపాల్లేకుండా జనం చీల్చిచెండాడేశారు. అదే రీతిన కురసాల కన్నబాబుకు గట్టి షాక్ ఇచ్చారు.



ఆ పాపమే పెను శాపమై..

- సెంట్రల్ జైలులో చంద్రబాబు
- అక్రమంగా 53 రోజులు బంధించిన జగన్
- ఆ క్షణం నుంచే ఓటరులో మౌన వేదన
- సమయం చూసి ఓట్లతో కొట్టారు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ చేసిన ఆ పాపాలే వైసీపీ పాలిట పెను శాపాలై వెంటాడి వేటాడాయి. ఆ పాపాలకు గత ఏడాది సెప్టెంబరు 10 పరాకాష్ఠ. రాష్ట్రానికి చీకటి రోజు. రాజకీయ కక్షతో రగిలిపోయిన జగన్.. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి రాజమండ్రి సెంట్రల్ జైలులోని స్నేహ బ్లాక్‌లో బంధించిన రోజు. ఆనాటి ప్రజల కన్నీరే ఓటు రూపంలో వైసీపీపై వేటు వేసింది. ప్రజాతీర్పులో వంచకులు కొట్టుకుపోక తప్పలేదు. చంద్రబాబును సీబీసీఐడీ అరెస్టు చేసిన క్షణం నుంచీ జనం కళ్లల్లో ఉబికివచ్చిన కన్నీరు ఇంకిపోయి కసిగా మారింది. చంద్రబాబు వయసు, రాజకీయ ప్రయాణం, సుదీర్ఘ అనుభవం, సంపదను సృష్టించే సామర్థ్యం.. ఏదీ వైసీపీ వారి కళ్లకు కనిపించలేదు. ఒకే లక్ష్యం.. చంద్రబాబును జైలుకు పంపడం. పైశాచిక ఆనందాన్ని పొందడం. అయితే కాలం ఊరుకున్నా ఓటరు ఊరుకుంటాడా. సరిగ్గా 8 నెలల 2 రోజులు పంటి బిగువున అదిమి పట్టుకున్న అభిమానం అగ్నిపర్వతమై జగన్నాటకాన్ని దహించేసింది. చంద్రబాబు జైలులో ఉన్న రోజులు నిజంగా ఓ చరిత్ర. ఆయన భద్రతపై జనం ఎంత భయపడుతున్నా ఆ 'లీడర్' మాత్రం నిండుకుండలా ఒక్క క్షణం కూడా తొణికిసలాడలేదు. పైగా జైలు నుంచే ప్రజలకు ధైర్యం చెప్పారు. కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఖైదీలు సైతం ఆయనతో మాట్లాడడానికి ఎంతో ప్రయత్నించారు. తమ గోడు వెళ్లబోసుకోవడానికి చూశారు. కానీ అవకాశం దక్కలేదు. జైలు రోడ్డులో వెళ్లే వాళ్లలో ఆవేదన కనిపించేది. పది మంది గుమిగూడి, హడావుడి కనిపిస్తే.. 'బాబు బయటకు వస్తున్నారా' అనే మాటే వినిపించేది. చిన్న పనులు చేసేవాళ్ల దగ్గర నుంచి ఐటీ ఉద్యోగుల వరకూ విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి రాజమండ్రి వచ్చి జైలు గోడలవైపు దీనంగా చూస్తూ నిశ్శబ్దంగా ఆవేదన చెందేవారు. చంద్రబాబు సతీమణికి మనోధైర్యం చెప్పి బరువెక్కిన గుండెలతో వెనుదిరిగేవారు. నిర్మాణానికి తాను సీఎంగా ఉన్నప్పుడు నిధులు మంజూరు చేసిన 'స్నేహ బ్లాక్' 53 రోజులు మౌనంగా రోదించింది. ఇప్పుడు అక్రమార్కుల రాక కోసం ఎదురుచూస్తోంది నిశ్శబ్దంగా..

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

సహకరించిన ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు



సాగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ హిమాన్షు శుక్లా కృతజ్ఞతలు తెలిపారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనంతో బాధ్యతగా పనిచేశారని ప్రశంసించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతం చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. పోలింగ్‌కు ముందు రోజు నుంచి పోలింగ్ సామగ్రిని తరలించడం, పోలింగ్‌ను విజయవంతంగా పూర్తిచేయడం, ఈవీఎంలను భద్రపరచడం వంటి పనులను విజయవంతంగా చేసిన అందరినీ అభినందించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడానికి రేయింబవళ్లు రక్షణగా నిలిచిన జిల్లా పోలీసులకు, కేంద్ర సాయుధ బలగాలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సహకరించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న పోలీసు పికెట్‌లు

అమలాపురం టౌన్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మొబైల్ పార్టీల పెట్రోలింగ్‌తో పాటు పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయని ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయినప్పటికీ ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ జిల్లా వ్యాప్తంగా పోలీసుల నిఘా కొనసాగుతుందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఘర్షణలు చెలరేగకుండా పోలీసు పికెట్‌లు కొనసాగిస్తున్నామన్నారు. జిల్లాలో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, సంబరాలు నిర్వహించడానికి ప్రస్తుతం అవకాశం లేదన్నారు. విజయం సాధించిన పార్టీ నాయకులు సహా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎవరైనా ఘర్షణలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ హెచ్చరించారు.

యువతకు భరోసా

- అన్నా... అంటూ ఆప్యాయతతో పలకరింపు
- 3.42 లక్షల మెజార్టీతో భారీ విజయం
- తండ్రి జీఎంసీ బాలయోగి హయాంలో తలపెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యం
- కోనసీమలో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందిస్తున్న ఎంపీ విజేత హరీష్‌మాధుర్



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నా ఎలా ఉన్నారు.. ఇక్కడ మన పార్టీకి మంచి మెజార్టీ తీసుకురావాలి.. మీకు ఏ చిన్న సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానంటూ భరోసా ఇస్తూ యువతను ఆకర్షించడంలో తండ్రిని మించిన తనయునిగా పేరొందాడు లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ పొందిన స్థానాల్లో ఒకరిగా హరీష్ రికార్డు సృష్టించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా 3.42 లక్షల ఓట్ల ఆధిక్యతతో ప్రత్యర్థి వైసీపీకి చెందిన రాపాక వరప్రసాద్‌పై భారీ విజయం సాధించారు. యువతను అవలీలగా ఆకట్టుకునే స్వభావం కలిగిన హరీష్‌మాధుర్ హోదాలతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమయ్యే మనస్తత్వం కలిగిన మహోన్నత వ్యక్తి. కార్యకర్త నుంచి నాయకుని వరకు అందరినీ అన్నా అని సంబోధిస్తూ ఆకట్టుకునే గుణగణాలు ఉన్నాయి. ఇప్పటికే కోనసీమ జిల్లాలో సమస్యలను ఆకళింపు చేసుకున్న ఎంపీ విజేత హరీష్‌మాధుర్ వాటి పరిష్కారానికి ప్రణాళికలను సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. లోక్‌సభతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకుని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లకు కానుకగా అందిస్తానన్న హామీని నిలబెట్టుకోవడంలో హరీష్‌ది అందెవేసిన చెయ్యి. ఎన్నికల ముందు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ టీడీపీ కూటమి అభ్యర్థిగా లోక్‌సభకు హరీష్ పేరు ప్రకటించిన తర్వాత అటు టీడీపీ, ఇటు జనసేనలో మంచి జోష్ నెలకొంది. అవలీలగా తన విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో మెజార్టీ సాధించిన వ్యక్తుల్లో హరీష్ మొట్టమొదటి వ్యక్తిగానే పేర్కొంటున్నారు. తండ్రిని మించిన తనయునిగా ప్రజల్లో గుర్తింపు పొందేందుకు హరీష్ తన అనుచరగణంతో సర్వశక్తులూ ఒడ్డడానికి కృషి చేస్తున్నారు.

హరీష్ ముందు చరిత్ర సృష్టించే లక్ష్యాలు...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కీలక సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఎంపీ హరీష్‌మాధుర్ స్వీకరించారు. వీటిలో తన తండ్రి బాలయోగి హయాంలో తలపెట్టిన ప్రాజెక్టులు కొన్నిటిని తన హయాంలో పూర్తిచేసి తండ్రి ఆశయాలకు పరిపూర్ణత చేకూర్చిన తనయునిగా పేరొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాలో కోటిపల్లి నుంచి నర్సాపురం వరకు రైల్వే లైన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. ఇప్పటికేగౌతమి, వశిష్ఠ, వైనతేయ నదులపై రైల్వే వంతెనల నిర్మాణం శరవేగంగా సాగుతున్న తరుణంలో తన హయాంలో రైల్వేట్రాక్ పూర్తిచేసి కోనసీమ వాసులకు రైలును అందించాలన్నదే ప్రధాన లక్ష్యంగా తీసుకున్నారు. అదే విధంగా కత్తిపూడి మీదుగా పామర్రు వరకు వెళ్లే 216 జాతీయ రహదారి అభివృద్ధితో పాటు గోదావరి నదులపై వారధులకు విద్యుదీకరణ, కేరళ తరహా అందాలను సొంతం చేసుకున్న కోనసీమ పర్యాటకంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎంపీ హరీష్‌మాధుర్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. వీటితో పాటు చమురు, సహజవాయువు నిక్షేపాలు అత్యధికంగా లభ్యమయ్యే కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పారనే లక్ష్యంగా తీసుకున్నట్టు సమాచారం. ఇలా కీలక ప్రాజెక్టులను తన హయాంలో పూర్తిచేసి చరిత్ర సృష్టించాలన్నదే ఎంపీ హరీష్‌మాధుర్ లక్ష్యం.

హరీష్‌కు భారీగా క్రాస్ ఓటింగ్

లోక్‌సభ స్థానంలో 23,571 ఓట్లు అదనపు ఆధిక్యం

అమలాపురం టౌన్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన గంటి హరీష్‌మాధుర్‌కు క్రాస్ ఓటింగ్ సైతం భారీగా కలిసి వచ్చింది. లోక్‌సభ పరిధిలో 23,571 ఓట్లు అసెంబ్లీ అభ్యర్థుల కంటే అదనంగా సాధించారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో హరీష్‌మాధుర్‌కు 1,00,276 ఓట్లు లభించగా అదే స్థానం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌కు 97,652 ఓట్లు లభించాయి. నియోజకవర్గంలో హరీష్‌కు 2,624 ఓట్లు క్రాస్ ఓటింగ్ ద్వారా అదనంగా లభించాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో హరీష్‌కు 1,21,329 ఓట్లు లభించగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన దాట్ల సుబ్బరాజుకు 1,18,687 ఓట్లు రాగా హరీష్‌కు 2,642 ఓట్లు అదనంగా లభించాయి. అమలాపురంలో హరీష్‌కు 1,10,309 ఓట్లు రాగా ఎమ్మెల్యేగా ఎన్నికైన అయితాబత్తుల ఆనందరావుకు 1,04,022 ఓట్లు లభించాయి. హరీష్‌కు అదనంగా 6287 ఓట్లు లభించాయి. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో హరీష్‌కు 96,623 ఓట్లు రాగా ఎమ్మెల్యే అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు 95,514 ఓట్లు దక్కాయి. హరీష్‌కు 1109 ఓట్లు అదనంగా లభించాయి. గన్నవరం నియోజకవర్గంలో హరీష్‌కు 1,01,989 ఓట్లు పోలవగా కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు 96,108 ఓట్లు లభించాయి. హరీష్‌కు 5881 ఓట్లు అదనంగా లభించాయి. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో హరీష్‌కు 1,34,769 ఓట్లు రాగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యానందరావుకు 1,34,286 ఓట్లు లభించగా హరీష్‌కు అదనంగా 483 ఓట్లు దక్కాయి. మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో హరీష్‌మాధుర్‌కు 1,20,854 ఓట్లు లభించగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావుకు 1,16,309 ఓట్లు రాగా క్రాస్ ఓటింగ్ ద్వారా హరీష్‌కు అదనంగా 4545 ఓట్లు లభించాయి.

అమలాపురంలో నోటాకు మూడో స్థానం

అమలాపురం టౌన్, జూన్ 5: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నోటాకు మూడో స్థానం దక్కింది. అయితాబత్తుల ఆనందరావు (టీడీపీ), పినిపే విశ్వరూప్ (వైసీపీ)మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయితాబత్తుల సుభాషిణికి 1327, బీఎస్పీ అభ్యర్థి పొలమూరి మోహన్‌బాబుకు 1971 ఓట్లు లభించాయి. నోటాకు 2105 ఓట్లు లభించాయి. దీంతో గత సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా మూడో స్థానాన్ని పదిలపరుచుకుంది. ఇక లోక్‌సభ నియోజకవర్గంలో నోటా నాలుగో స్థానంలో వుంది. గంటి హరీష్‌మాధుర్ (టీడీపీ), రాపాక వరప్రసాదరావు (వైసీపీ) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. జంగా గౌతమ్ (కాంగ్రెస్) 15,070 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. నోటాకు 13,499 ఓట్లు లభించాయి.

కూటమి వెంటే ఉద్యోగులు...

సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్యధికంగా కూటమి వెంటే ఉన్నారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గంలో 16,149 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా గంటి హరీష్‌మాధుర్‌కు అత్యధికంగా 10,832 ఓట్లు లభించాయి. వైసీపీ తరఫున పోటీ చేసిన రాపాక వరప్రసాదరావుకు 4,423, జంగా గౌతమ్ (కాంగ్రెస్)కు 559 లభించాయి. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 2,619 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా టీడీపీకి అత్యధికంగా 1571 ఓట్లు, వైసీపీకి 789, నోటాకు 138 లభించాయి. ఇక ఈ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక్క రిజక్టెడ్ ఓటు కూడా నమోదు కాకపోవడం విశేషం.

బీసీ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్, జూన్ 5: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కన్వీనర్ డాక్టర్ వైటీఎస్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో మిగులుగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు. బాలికలకు రామచంద్రపురం, రాజమహేంద్రవరం, బాలురకు అమలాపురం, కరప, తుని, పెద్దాపురం, అనపర్తిలలో గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సమనస గురుకుల పాఠశాలలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారం కోసం 9866195979, 6309813777, 9652818307 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పదో తేదీలోపు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు తమ సర్టిఫికెట్లను దగ్గరలోని ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్ ఎంవీజీ వర్మ కోరారు. కాకినాడ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలతో పాటు అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. జిల్లాలో 1284 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా వారిలో 583 మంది విద్యార్థులు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులను మెరిట్ జాబితాలోకి తీసుకోమని వర్మ చెప్పారు.



ఎవరు గెలిచినా మీదే గెలుపు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విజేతలు

ప్రథమ బహుమతి: రూ.10వేలు

పి. సూర్యకుమారి
మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా.

ద్వితీయ బహుమతి: రూ.5వేలు

1. చిక్కాల భాస్కరరావు
   మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్. సత్యరామారావు
   ఇంజరం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం.

డ్రా వివరాలు ...7లో

మళ్లీ ఇన్నాళ్లకు..

రంపచోడవరంలో 15ఏళ్ల తర్వాత టీడీపీ విజయం


శిరీషాదేవి

(రంపచోడవరం):తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఏజెన్సీ కంచుకోటగా ఉంది. అయితే రంపచోడవరంలో గత మూడు దఫాలుగా చవిచూసిన వైఫల్యాలను దాటి ఈ ఎన్నికల్లో ఊహించని రీతిలో తెలుగుదేశం పార్టీ మళ్లీ ఇక్కడ పాగా వేసింది. 1983లో దివంగత ఎన్టీ రామారావు సారథ్యంలో మన్యం ఓటర్లు తెలుగుదేశానికి పట్టం కట్టి 2004 వరకూ ఆరు సార్లు వరుస విజయాలను కట్టబెట్టారు. లోపం ఎవరిదైనప్పటికీ 2009లో ప్రారంభమైన వైఫల్యం 2019 వరకూ మూడు దఫాలుగా వరుసగా ఆ పార్టీని వెంటాడింది. ఓడిన ప్రతిసారీ అధిష్ఠానం ముఖ్యంగా అధినేత చంద్రబాబు సైతం ఎన్నో మార్పులను చేసినా ఫలితం రాలేదు. అయితే ఈ సారి మాత్రం 1983 మాదిరి ప్రభంజనంగా రాష్ట్ర వ్యాప్తంగా సునామీలా పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో రంపచోడవరం కూడా దేశం ఖాతాలోకి తిరిగి వచ్చేసింది. 2009 ఎన్నికల్లో ఇక్కడ తొలిసారిగా తెలుగుదేశం ఓడిపోగా, 2014, 2019లలో కూడా అదే ఓటమి. 2019లో అయితే ఆ ఓటమి 39 వేల పైచిలుకు మెజారిటీతో ప్రత్యర్థి పార్టీకి విజయాన్ని తెచ్చిపెట్టింది. 2024 ఎన్నికల్లో పార్టీ దశ తిరిగింది. ఓటర్లు టీడీపీ వైపు ఆకర్షితులయ్యారు. మొత్తం 2,10,508 ఓట్లు నమోదు కాగా, టీడీపీ అభ్యర్థికి 90087 ఓట్లు వచ్చాయి. వైసీపీకి 80948 ఓట్లు వచ్చాయి. సీపీఎంకు అనూహ్యంగా 21265 ఓట్లు వచ్చాయి. మొత్తంగా టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి తన సమీప ప్రత్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మిపై 9139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

52 ఏళ్ల తర్వాత ఆ కుటుంబానికి ఎమ్మెల్యే గిరీ



ప్రత్తిపాడు, జూన్ 5: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వరుపుల జోగిరాజు కుటుంబానికి మళ్లీ 52 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే పదవి వరించింది. 1972 ప్రత్తిపాడు అసెంబ్లీ ఎన్నికల్లో వరుపుల జోగిరాజు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ప్రత్యర్థి అయిన ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్రగడ వీరరాఘవరావుపై విజయం సాధించారు. అనంతరం నాలుగున్నర దశాబ్దాల వరకు వరుపుల జోగిరాజు కుటుంబం నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే గత ఎన్నికల్లో దివంగత వరుపుల జోగిరాజు మనవడు వరుపుల రాజా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 4616 ఓట్ల తేడాతో ఓడిపోయారు. వరుపుల రాజా వారసురాలుగా ఆయన భార్య వరుపుల సత్యప్రభ ప్రస్తుత ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో టీడీపీ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రత్యర్థి అయిన వైసీపీ అభ్యర్థి తాత వరుపుల సుబ్బారావుపై 38768 ఓట్ల మెజార్టీ తో విజయం సాధించారు. వరుపుల జోగిరాజు ఎమ్మెల్యే పదవి చేపట్టిన 52 ఏళ్ల తర్వాత ఆయన మనవడు భార్య సత్యప్రభ భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థిగా విజయం సాధించడంతో మళ్లీ జోగిరాజు కుటుంబానికి రెండో సారి ఎమ్మెల్యే పదవి లభించింది.

అంగన్‌వాడీ కేంద్రం నుంచి అసెంబ్లీకి


సహచర సిబ్బందితో ఎమ్మెల్యే విజేత శిరీషాదేవి(సర్కిల్‌లో)

రాజకీయాల్లోకి వచ్చిన ఐదు నెలల్లోనే రంప ఎమ్మెల్యేగా గెలుపొందిన శిరీషాదేవి

(రంపచోడవరం): ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాణించేందుకు మంచి విద్యార్హతలు ఉండి కూడా ఉన్న ఊరికే సేవ చేసే లక్ష్యంతో అంగన్వాడీ కార్యకర్తగా చిరు ఉద్యోగంలో చేరిన ఆమె ఊహించని రీతిలో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఐదు నెలలకే రంపచోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు మిరియాల శిరీషాదేవి.. ఈ ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి ఎన్నిక కావడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆమె పరిచయమయ్యారు.. బీఎస్సీ, బీఈడీ చేసిన ఆమె ఉపాధ్యాయ పోస్టుకు అర్హతలు అన్నీ ఉన్నా, తన గ్రామంలోనే ఉండి సేవ చేయడం కోసం అంగన్వాడీ ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. ఉమ్మడి కుటుంబంగా అత్తవారి ఇంట ఉన్న ఆమెకు తన భర్త విజయభాస్కర్ తెలుగుదేశం పార్టీలో యువజన విభాగానికి నాయకుడు కావడంతో, 2024 ప్రారంభంలో రాజకీయాల్లోకి వచ్చి రంపచోడవరం అభ్యర్థిత్వం కోసం తెలుగుదేశం పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎందరో సీనియర్లతో పోటీ పడిన ఆమె మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ప్రోత్సాహంతో రంపచోడవరం టీడీపీ అభ్యర్థిత్వాన్ని పొందడంతో పాటు విజయాన్ని కూడా కైవశం చేసుకున్నారు.

యనమల ఇంట పదవుల పంట


యనమల దివ్య


రామకృష్ణుడు


పుట్టా మహేష్


పుట్టా సుధాకర్

తొండంగి,జూన్ 5: టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఇంట ఈసారి పదవుల పంట పండింది. ఆయన పెద్ద కుమార్తె యనమల దివ్య తుని నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆయన రెండో అల్లుడు పుట్టా మహేష్ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసి పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల వియ్యంకుడు మాజీ టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. యనమల శాసన మండలి ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. యనమల ఇంట పదవుల పంట పండడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే విజేతల పూజలు


ఆశీర్వచనం అందుకుంటున్న జ్యోతుల నెహ్రూ కుటుంబం


స్వామివారిని దర్శించుకున్న యనమల దివ్య

అన్నవరం, జూన్ 5: రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడి సన్నిధిలో నూతన ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య వేర్వేరుగా బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. జ్యోతుల నెహ్రూ వెంట దేవస్థానం మాజీ ట్రస్టీ కొత్త కొండబాబు, రిటైర్డ్ పీఆర్వో తులా రాముడు తదితరులుండగా, యనమల దివ్య వెంట దేవస్థానం పూర్వపు ట్రస్టీ యనమల రాజేష్ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' డ్రా


రాజమహేంద్రవరం ఆంధ్రజ్యోతి యూనిట్‌లో డ్రా నిర్వహిస్తున్న దృశ్యం

విజేతలు వీరే

ప్రథమ బహుమతి: రూ.10 వేలు
పి.సూర్యకుమారి, మురమండ, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా

ద్వితీయ బహుమతులు ముగ్గురికి: రూ.5వేలు
1.చిక్కాల భాస్కరరావు, మోరి, సఖినేటిపల్లి మండలం, కోనసీమ జిల్లా.
2. ఎస్.సత్యరామారావు, ఇంజరం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా.
3. అలజంగి నాగరాజు, రామచంద్రపురం

రాజమహేంద్రవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరిట ఆంధ్రజ్యోతి నిర్వహించిన సర్వేకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తుందో అంచనాలు చెప్పాలంటూ జిల్లా ఎడిషన్లలో ఆరు కూపన్లు ప్రచురించింది. సుమారు వెయ్యి మందికిపైగా ఫలానా పార్టీ గెలుస్తుందంటూ పూర్తి చేసిన కూపన్లను రాజమహేంద్రవరంలోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయానికి పంపించారు. మొత్తం 19 స్థానాల్లోనూ కూటమే విజయం సాధిస్తుందని సుమారు 200 మంది కచ్చితమైన అంచనాలను రాసి పంపారు. బుధవారం సాయంత్రం ఈ ఎంపిక చేసిన కూపన్ల నుంచి డ్రా తీసి నలుగురిని విజేతలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు ఎస్.శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్చార్జి బీహెచ్‌వీ మంగేష్, యాడ్స్ మేనేజరు సీహెచ్ కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజరు బి.గోపాలకృష్ణ, ప్రొడక్షన్ మేనేజరు రాజేంద్ర, సిస్టమ్స్ ఇన్‌చార్జి ఎన్.శివకుమార్, తూర్పుగోదావరి జిల్లా రిపోర్టింగ్ ఇన్‌చార్జి ఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం, జూన్ 5: పిఠాపురం ఎమ్మెల్యే విజేత, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ ఎన్ వర్మ కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పవన్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ మాట్లాడుతూ తన వెన్నంటి ఉండి జనసేన విజయం కోసం, తన విజయం కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వర్మను వేదికపైకి పిలిచి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. వర్మ పవన్‌ను సత్కరించి అన్నవరం ప్రసాదం అందజేశారు. పవన్ మాట్లాడుతూ వర్మను గుండెల్లో పెట్టి చూసుకుంటానన్నారు. తన గెలుపులో వర్మ కీలకపాత్ర పోషించారని తెలిపారు. టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలకు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

10లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తప్పనిసరిగా దగ్గరలో ప్రభుత్వ ఐటీఐలు కాకినాడ, జగ్గంపేట, అమలాపురం జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఈనెల 10వతేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, డిస్ట్రిక్ట్ కన్వీనర్ ఎంవీజి వర్మ తెలిపారు. ఇప్పటివరకు 1284 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా వారిలో 583 మంది విద్యార్థులు మాత్రమే వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు.

జూలై 20న ఆర్యాపురం కోఆపరేటివ్ పాలకవర్గం ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 : రాజమహేంద్రవరంలోని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం 3127 పాలకవర్గం ఎన్నికలు జూలై 20న జరిపేందుకు నిర్ణయిస్తూ జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారని ఎన్నికల అధికారి, కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ జూలై 11 నుంచి ఉంటుందని, ఉపసంహరణ 13న, ఎన్నికలు 20న నిర్వహించడానికి ఆదేశించారని తెలిపారు. అర్హత గల ఓటరు జాబితాను తయారు చేయడానికి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై 4న తుది జాబితాను ప్రకటించుటకు కార్యాచరణ చేపడుతున్నట్లు ఎన్నికల అధికారి కృష్ణకాంత్ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి


దేవి(ఫైల్)

రౌతులపూడి, జూన్ 5: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ఏలూరి దేవి (30) పిడుగు పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... భర్త నారాయణతో కలిసి కట్టెల కోసం గ్రామ శివారు ఉన్న కొండ వద్దకు వెళ్లింది. కట్టెలు తెస్తున్న సమయంలో ఉరుములతో కూడిన వర్షం పడింది. వర్షం వస్తున్న సమయంలో దేవిపై పిడుగు పడడంతో మృతి చెందింది. దేవికి పాప, బాబు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



జీజీహెచ్ (కాకినాడ) జూన్ 5 పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యవంతమైన మానవ మనుగడ సాధ్యమని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైస్ ప్రిన్సిపాళ్లు డా.విష్ణువర్ధన్, డా.దేవీమాధవి ఆధ్వర్యంలో బుధవారం ఆర్ఎంసీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డా. విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎక్కడికక్కడ చెట్ల నరికివేత ద్వారా కాలుష్యం అధికమై ఆ ప్రభావం మానవ మనుగడపై పడుతుందన్నారు. ముఖ్యంగా నిరూపయోగంగా మారి నిస్సారమవుతున్న నేలను ఆధునిక సాంకేతికత, నూతన మెలకువల ద్వారా ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి భూమిని సారవంతం చేసి సాధ్యమైనంత ఎక్కువ ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను నాటడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పర్యావరణానికి సంబంధించి ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలో 30 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డా.శశి, కమ్యూనిటీ మెడిసన్ విభాగాధిపతి డా.సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.సౌమ్య పాల్గొన్నారు.

‘రోజాకు సారె, చీర పంపిస్తున్నాం’


రోజాకు బహుమతిగా పంపనున్న సారె,చీర, స్వీట్లను చూపుతున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జూన్ 5: వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని కాకినాడ రూరల్ నియోజకవర్గం కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి) అన్నారు. బుధవారం 47వ డివిజన్ కరణంగారి సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం కోసం లోకేశ్‌పై వైసీపీ నాయకులు అవహేళన చేసి మాట్లాడారని, చరిత్రలో ఎవరికీ రాని మెజారిటీ మంగళగిరిలో లోకేశ్‌కు వచ్చిందన్నారు. లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనిల్‌కుమార్ యాదవ్, రోజా తదితర మాజీ మంత్రులు ఎన్నికల్లో గాల్లో కొట్టుకుపోయారన్నారు. రోజాకి రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో రోజా బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారంతా పత్తాలేకుండా పోయారన్నారు. ఓటమిపాలైన రోజా అత్తారింట్లో కాపురం చేసుకునేందుకు టీడీపీ మహిళలు సిద్ధం చేసిన సారె, చీరలు, స్వీట్లను బహుమతిగా పంపుతున్నట్లు తెలిపారు. ఈ బహుమతులు స్వీకరించాలని కాకినాడ కాజా కూడా పంపుతున్నామన్నారు. త్వరలో అన్ని జిల్లాల నుంచి పార్సిల్స్‌లను పంపించనున్నట్లు చెప్పారు. కూటమి ఎమ్మెల్యేగా పంతం నానాజీ, ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడమే కాకుండా టీడీపీ కూటమికి పట్టం కట్టిన ప్రజలు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, కాకరపల్లి చలపతిరావు, కొజు నెహ్రూ, దేవు వెంకన్న, కొల్లాబత్తుల అప్పారావు, వేటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ మార్కులు

కాకినాడ రూరల్, జూన్ 5: నీట్ 2024 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆదిత్య కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వి.స్పృజన్ 720 మార్కులకు గానూ 715 మార్కులతో అఖిలభారత ఓపెన్ కేటగిరీలో 115వ ర్యాంకును సాధించారన్నారు. అదే విధంగా ఎస్‌హెచ్‌డీ శ్రావణ సత్యరవికిరణ్ 710 మార్కులతో 411వ ర్యాంకును, ఎం.విశ్వత్ 705 మార్కులతో 104వ ర్యాంకును, ఎం.నైమితరాణి 382వ ర్యాంకులను పొందినట్లు తెలిపారు. అంతే కాకుండా ఆర్ఎంఎస్ఎస్ రామగోపాల్ 695, కేఎస్‌బీ సుందరి 695, డి.ప్రహ్లతిక 690, ఐఎల్ఎస్ సత్యాషిణి 690 మార్కులు సాధించారన్నారు. 19 మంది విద్యార్థులు 650పైనా 36 మంది విద్యార్థులు, 600పైనా 72 మంది విద్యార్థులు, 550పైనా సాధించి ఒకే క్యాంపస్ నుంచి 100 మెడికల్ సీట్లతో విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపక వర్గాన్ని ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, దీపక్‌రెడ్డి, లక్ష్మీరాజ్యం తదితరులు అభినందించారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు




క్షతగాత్రులు

పిఠాపురం, జూన్ 5: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ శివారులోని కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కోలంక గ్రామం నుంచి తల్లీకుమారులు మోటార్‌సైకిల్‌పై పిఠాపురం వెళుతున్నారు. అదే సమయంలో పిఠాపురం నుంచి దివిలి వెళ్తున్న కారు వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరి విత్తనాలు పంపిణీ


రంగంపేటలో రైతులకు విత్తనాలు సరఫరా చేస్తున్న వెంకట నరసింహారావు

రంగంపేట/దివాన్‌చెరువు, జూన్ 5 : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమజ్యోతిలు బుధవారం రంగంపేట మండలంలో గల అభ్యుదయ రైతులకు రంగంపేటలో నూతన వరి రకాలను పరిశోధన నిమిత్తం పంపిణీ చేశారని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వరి రకాలైన ఎంటీయూ 1271, 1275, 1310, బీపీటీ, 2858, 2841 వంటి రకాలను ప్రస్తుత సార్వాలో రైతుల కమతాలలో పరీక్షచేసి వాటి గుణగణాలను పోలిన రకాలు, ఎప్పటి నుంచో రైతులు వాడుతున్న ఎంటీయూ 7029, బీపీటీ 5204 వంటి రకాలతో పోల్చి ఫలితాలను విశ్లేషించి, సిఫార్స్ చేస్తామన్నారు. అంతేకాక బీపీటీ 2841 వంటి నల్ల బియ్యం రకాలను, పోషక విలువలు కలిగిన రకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషికి వ్యవసాయశాఖ అధికారులు, రైతులు వారిని అభినందించారు. అనంతరం శాస్త్రవేత్తలు నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి కె.శ్రీనివాస్, వి.మహేష్, రైతులు పోతుల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో రాజధాని నిర్మాణం తథ్యం

అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్


మాట్లాడుతున్న అమలాపురం పార్లమెంట్ విజేత గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూన్ 5: అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తిచేసి తీరతామని అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రనే తిరగరాసిందన్నారు. ఇది ప్రజా విజయమన్నారు. నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకునే రాష్ట్ర ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నారన్నారు. ఎంపీగా ఎన్నికైన అనంతరం బుధవారం అమలాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అరకొర సంక్షేమంతో పాటు జగన్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. సంక్షేమం పేరుతో దోపిడీ పాలన సాగించిందన్నారు. 2014-19లో జరిగిన అభివృద్ధి మాత్రమే నేడు కనిపిస్తోందని, వైసీపీలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ఎన్డీయేతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గుర్తించి ప్రజలు ఓట్లు వేశారని, వారి నమ్మకాన్ని నిలబెడతామన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పుట్టినరోజు నాడు టిక్కెట్టు ఇవ్వగా ఆయనకు రిటర్న్ గిఫ్ట్‌గా ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించి ఇస్తానన్న మాటను ప్రజలు నిలబెట్టారన్నారు. కోనసీమ రైల్వే లైన్ నిర్మాణాన్ని ఐదేళ్లలో పూర్తి చేయడంతో పాటు పారదర్శక పాలన సాగిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఓఎన్జీసీ, వేదాంత, గెయిల్ వంటి చమురు సంస్థలతో చర్చిస్తానన్నారు. లంక గ్రామాల ప్రజలు కనీసం మౌలిక వసతులు లేని పరిస్థితుల్లో ఉన్నారని, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. ఎన్డీయేలో మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా టీడీపీ అధినేత తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని హరీష్‌మాధుర్ సమాధానమిచ్చారు. మెట్ల రమణబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు, విద్యార్థులు, యువత, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సైకో పరిపాలనకు రాష్ట్ర ప్రజలు సరైన తీర్పు ఇచ్చారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు యాళ్ల నాగసతీష్, చిక్కాల గణేష్, నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, బొర్రా ఈశ్వరరావు, ఆశెట్టి ఆదిబాబు, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, భాస్కర్ల రామకృష్ణ, వలవల శివరావు, గంధం శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తి మృతి



ఎటపాక,జూన్ 5: ప్రమాదవశాత్తు అదుపుతప్పి ద్విచక్ర వాహనం, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాంగోపాలపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జేర్పపాల్ సమీపంలోని పూసుగూడెం గ్రామానికి చెందిన మడివి భీమా(35) ఓ పని నిమిత్తం భద్రాచలం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రాంగోపాలపురం వద్ద కుంట నుంచి విజయవాడ వైపు వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుని ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భీమా తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్ పాసుల జారీ ఉండదు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 5 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలోని బస్ పాసుల జారీ కౌంటర్ సాఫ్ట్‌వేర్ నవీకరణ జరుగుతున్న కారణంగా ఈనెల 6, 7 తేదీల్లో (గురు, శుక్రవారాలు) బస్‌పాసుల జారీ ఉండదని డిపో మేనేజర్ షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 8వ తేదీన కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని, విద్యార్థులు, మంత్లీ సీజన్ టిక్కెట్లు తీసుకునేవారు, ప్రత్యేక ప్రతిభావంతులు తదితరులంతా సహకరించాలని కోరారు.

పేదలకు జనసైనికుల సాయం

అల్లవరం, జూన్ 5: పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో కొమరగిరిపట్నంలో జనసైనికులు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. తిరుమల రమేష్, అప్పన శ్రీను, లింగం సతీష్, అడ్డాల దుర్గారావు, ఆకుల లోవ రాజు, సుంకర సతీష్, కొమ్ముల పవన్, సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు. గోడిలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు బండారు శ్రీను ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం




అమలాపురం: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ద్రాక్షారామ: మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి

అమలాపురం రూరల్, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు. ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి ఈవని విశ్వేశ్వరశర్మ, అడ్డాల గోపాలకృష్ణ, కుడుపూడి శాంతిభూషణం, రంకిరెడ్డి కాశీ, ఆకెళ్ల బుజ్జి, మహిపాల శ్రీనివాసరావు, ఉపద్రష్ట సూర్యఫణి తదితరులు పాల్గొన్నారు.

మండపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్య తని వక్తలు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మండపేటలో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యువత బుధవారం మొక్కలు నాటారు. పర్యావరణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారా యణ అన్నారు. వాకర్స్‌క్లబ్ సభ్యులు యువత పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: సింగరాయపాలెం అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటారు. సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి పర్యావరణ పరిరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి.సుశీల, డి.నాగకుమారి, ఎ.లక్ష్మీ దుర్గ, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ర్యాలి మ్యాజిక్ హౌస్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పలువురి చిత్రాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకుడు శ్యామ్ పర్యావరణ ఆవశ్యకతను వివరించారు.

కాట్రేనికోన: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డివిజన్ అటవీశాఖాధికారి ఎమ్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కందికుప్ప సెక్షన్ పరిధిలో మొక్కలు నాటారు. కందికుప్ప డీఆర్వో రవి, పట్టాభి, బాలబ్బాయ్, శ్రీబాలపాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని శ్రమ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ ఈశ్వరి అన్నారు. బుధవారం అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, అద్దంకివారిలంక, నల్లూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రమ స్వచ్ఛంద సంస్థఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా బాలలతో డ్రాయింగ్ కాంపిటేషన్స్, పర్యావరణంపై ఆర్ట్ వేయించడం, పర్యావరణానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, బాలసంఘాల పిల్లలు, శ్రమ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: మనిషి ఆధునిక జీవనశైలిలో వచ్చిన మార్పులతో ప్లాస్టిక్ వస్తువుల విచ్చలవిడి వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుందని మానవాళికి ముప్పు పొంచి ఉందని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కలమకుమారి తెలిపారు. బి.సావరం శోభనా పాఠశాల సమావేశంలో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆఫ్ కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. నేషనల్ గ్రీన్ కోర్ స్టేట్ మోనటరింగ్ అధికారి జి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రోజురోజుకు గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతుందన్నారు. మరో ముఖ్యఅతిథి సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ఎ.మధుసూదనరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఎంఈవో ఎన్.మనోహరం, ప్రోగ్రాం డీవైఈవో జి.సూర్యప్రకాశరావు, ఎఫ్ఏవో ప్రవీణ్, జిల్లా నోడల్ అధికారి బి.సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, ఎంపీకే భీమారావు, డి.రమేష్‌బాబు, జీబీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో-2 ప్రసాదరావు, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోషఫ్, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం విపర్తి శాంతి సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణంతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ నేత వుండవిల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస్, మల్లిపూడి చిన్న, వుండవిల్లి శివ, ఉపాధ్యాయుడు దేవరకొండ సుబ్బారావు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు నాయక్ అన్నారు. బుధవారం కోర్టుల ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీ మోహన వెంకట రమణ, వాడ్రేవు సాయిప్రసాద్, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాలిగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, మాజీ ఏజీ పి.కె.వి.వి.సత్యనారాయణ, న్యాయవాదులు ఐ.శ్రీరామ్, దుర్గాదేవి, కల్యాణి, ఆనాల గంగాభవానీ, కె.రాజకుమారి పాల్గొన్నారు.

కె.గంగవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యతని కె.గంగవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం జరుగుతుందన్నారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. అద్దంపల్లి, పామర్రు, కుందూరు, దంగేరు, శివల ఉన్నత పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి జేవీ కనకదుర్గ అధ్యక్షతన బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ కార్యక్రమాలను ప్రతీ పాఠశాలలో నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణానికి ప్లాస్టిక్ తెచ్చే ముప్పు గురించి, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఎంఈవో కోరారు. పాఠశాల ఆవరణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు వై.ఫణికుమార్, జి.సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని దీప్తి స్కూలు కరస్పాండెంట్ బీవీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు దీప్తి స్కూలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షకు ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఆయాకార్యక్రమాల్లో పాఠశాల హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, దాట్ల బుచ్చిబాబులకు సత్కారాలు

ఎమ్మెల్యే విజేతలకు అభినందనల వెల్లువ





ఆత్రేయపురం: బండారుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం, ఐ.పోలవరం: బుచ్చిబాబు దంపతులను సన్మానించిన దృశ్యం, మండపేట: ఎమ్మెల్యే వేగుళ్లకు నాయకుల అభినందనలు

మలికిపురం, జూన్ 5: రాజోలు కూటమి అభ్యర్థి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన దేవ వరప్రసాద్‌ను అభిమానులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్కుకు వెళ్లి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. రాజోలు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సంబరాల్లో పాల్గొన్నారు. దేవ వరప్రసాద్ స్వగ్రామం దిండిలో బందెల పద్మ, గోనిపాటి రాజు విజయోత్సవాలు నిర్వహించారు. పలువురికి మిఠాయిలు పంచారు. గ్రామాల్లో పోలీసులు నిబంధనలు అమలులో ఉండడంతో ఆయా పరిధుల్లోని బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుతున్నారు. మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీసరస్వతి రమేష్, జనసేన నాయకుడు పేరాబత్తుల సచిన్, దిరిశాల మణి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్ పాల్గొన్నారు.

మూడోసారి ప్రధానిగా మోదీ

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మూడోసారి జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమి రాష్ట్రంలో ఘన విజయం సాధించడం పట్ల మలికిపురం, సఖినేటిపల్లి మండలాల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానిగా మూడోసారి నరేంద్రమోదీపై ప్రజలు విశ్వాసం ఉంచడంపై కార్యకర్తలకు బీజేపీ నాయకుల అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే హయాంలో రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయని వారు అన్నారు. సమావేశంలో అడబాల రాంబాబు, ఇందుకూరి అచ్యుతరామరాజు, కాపిశెట్టి కనకేశ్వరరావు, మేడిచర్ల చాణుక్య, కంచి నాగేశ్వరరావు, అడబాల వెంకన్నబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హర్షం

ముమ్మిడివరం, జూన్ 5: రాష్ట్రంలో కూటమి అత్యధిక స్థానాలు సాధించి ప్రభంజనాలు సృష్టించడం పట్ల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ తొలిసారిగా రాష్ట్రంలో ఘన విజయం సాధించి ప్రభంజనాన్ని సృష్టించగా ఆ తరువాత కూటమి ఆ స్థాయిలో విజయం సాధించి ప్రభంజనాన్ని సృష్టించిందన్నారు. కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లు ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేసి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నలమాటి లంకరాజు, ముమ్మిడివరపు రాజేష్, ఉందుర్తి ప్రకాశరావు, బండారు నాగేశ్వరరావు, ముమ్మిడివరపు శ్రీను, పువ్వల శ్రీను, తొత్తరమూడి శ్రీను, ఉందుర్తి వెంకట్రావు, చెల్లూరి సత్యనారాయణమూర్తి ఉన్నారు.

హరీష్‌కు అభినందనలు

మలికిపురం, జూన్ 5: అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన గంటి హరీష్ మాధుర్‌ను టీడీపీ నాయకులు అమలాపురంలో కలిసి ఆయన్ను అభినందించారు. హరీష్‌మాధుర్ తనపై అభిమానంతో అత్యధిక మెజార్టీతో విజయానికి కృషిచేసిన మీ అందరికీ కృతజ్ఞతలు తెలిపినట్టు నాయకులు తెలిపారు. హరీష్‌మాధుర్‌ను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, చవ్వాకుల శ్రీరామ్ తదితరులు ఉన్నారు.



మలికిపురం: హరీష్‌మాధుర్‌కు అభినందనలు

ఎమ్మెల్యే బండారుకు అభినందనలు

ఆత్రేయపురం, జూన్ 5: కొత్తపేట ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన బండారు సత్యానందరావును టీడీపీ శ్రేణులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. బుధవారం మండలంలోని 17గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాడపాలెం తరలివెళ్లి సత్కరించారు. భారీ కేక్‌లు కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. వాడవాడలా పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చారు.

టీడీపీ నేతల సందడి

అల్లవరం, జూన్ 5: రాష్ట్రంలో కూటమి గెలవడంతో పాటు అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యేలుగా గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించడంతో టీడీపీ నాయకులు సందడి చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు స్వగృహం వద్ద ఆ పార్టీ నాయకులు ఆనందంగా గడిపారు. నార్గన శ్రీనివాస్, వేగిరాజు శ్రీనురాజు, మంతెన సురేష్‌రాజు, రాసూరి రాంబాబు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పవన్ పంచ్ డైలాగులే నిజం చేశాయి

వైసీపీకి 15సీట్లు కూడా రావని, జగన్ నిన్ను అథఃపాతాళానికి తొక్కొస్తానంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలే నిజమయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు పాలన రావడానికి కూటమి ఏర్పాటులో పవన్ కల్యాణ్ పాత్రఎంతో ఉందంటున్నారు. పవన్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంపై సినీనటుడు గుర్రం రామకృష్ణారావు, జబర్దస్త్ బాబి, గొలకోటి హరి హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు అభినందనలు

మండపేట, జూన్ 5: మండపేట నియోజకవర్గం నుంచి నాల్గవసారి విజయం సాధించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావును టీడీపీ, జనసేన, బీజేపీ, శ్రేణులు అభినందనలతో ముంచెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయం కార్యకర్తలు, నాయకులతో కళకళలాడింది.టీడీపీ కార్యాలయానికి వస్తున్న వారితో రథంగుడి కేపీ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన నేతలు వేగుళ్లను కలిసి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. తన విజయానికి కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడును, ఎమ్మెల్యేగా విజయం సాధించిన యనమల దివ్యను బుధవారం కోనసీమ జిల్లా నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు షేక్ ఇబ్రహిం, మైనార్టీసెల్ నాయకుడు సల్మాన్ కలిసి సత్కరించారు.

బుచ్చిబాబుకు అభినందనలు

ఐ.పోలవరం, జూన్ 5: ముమ్మిడివరం ఎమ్మెల్యే విజేత దాట్ల బుచ్చిబాబును అభినందించేందుకు కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో బుధవారం మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద సందడి నెలకొంది. బుచ్చిబాబుకు అభినందనలు తెలిపేందుకు కార్యకర్తలు పోటీపడ్డారు.మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జడ్పీ మాజీచైర్మన్ నామనరాంబాబు, డొక్కా నాథ్‌బాబు, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, మందాల గంగసూర్యనారాయణ, గొలకోటి దొరబాబు, నడింపల్లి సుబ్బరాజు, సాగిరాజు సూరిబాబురాజు, రాయపురెడ్డి నీ లకంఠేశ్వరరావు, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, చోడిశెట్టి బ్రహ్మానందం, లంకలపల్లి దుర్గాదేవిమునిరాజు, పెంట రవి, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, చెయ్యేటి శ్రీనుబాబు, సాకా సీతాదేవి, ధూళిపూడి బాబి, పొద్దోకు బాలు, అర్దాని శ్రీను పాల్గొన్నారు.

బుచ్చిబాబుకు వేదాశీర్వచనం

మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యేగా ఎన్నికైన దాట్ల బుచ్చిబాబు దంపతులకు బుధవారం పండితులు వేదాశీర్వాదం అందించారు. కార్యక్రమంలోయనమండ్ర సత్యసీతారామశర్మ, యనమండ్ర సుబ్బారావు, పేకేటి శ్యామలకుమార్, నాగభట్ల రామకృష్ణ, నాగభట్ల రవిప్రసాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలు కృషి ఫలితమే ఘనవిజయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్5: నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల కృషి ఫలితంగానే తాను ఘన విజయం సాధించానని వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకోడ్ ఈనెల6 వరకు ఉన్నందున తర్వాత విజయోత్సవాలు జరుపుకుందామన్నారు. టీడీపీ సీటు ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు విజయవాడ వెళుతున్నట్లు తెలిపారు. రెండు రోజులు అందుబాటులో ఉండనని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు.

కూటమి విజయం పట్ల హర్షం

రాష్ట్రంలో కూటమి ఘనవిజయం సాధించడం పట్ల బీజేపీ జిల్లా కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఐదు కోట్ల మంది ప్రజలు అంతిమ తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతను మౌనంగా ఓట్ల రూపంలో చూపారని అన్నారు. కూటమికి ఘనవిజయం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ వ్యవస్థతో కార్యకర్తలు దూరం



అంబాజీపేట, జూన్5: వైసీపీపాలనలో నవరత్నాల పేరుతో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలను దూరం చేసుకుని ఇప్పుడు ఓటమి పాలయ్యారని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు అన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కకుండా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు జగన్ కుట్ర పన్నారని, ఆ కక్షతోనే రాష్ట్రంలోని సర్పంచ్‌లు వైసీపీపై ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. జగన్‌పాలనలో నిధులు,విధులులేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు, సర్పంచ్‌లు మంచిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం



రాయవరం, జూన్ 5: వెదురుపాక-అరికరేవుల రోడ్డులో పంట పొలాల మధ్యలో ఉన్న శ్రీసత్తెమ్మ అమ్మవారి సంబరం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయనిర్వాహకుడు సురేష్ ఆధ్వర్యంలో నాలుగురోజులు అమ్మవారి ప్రతిరూపాలైన గరగలనుగ్రామోత్సవం నిర్వహించారు. సంబరంలో శక్తివేషాలు, గరగ నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. వెదురుపాక, అరికరేవుల, మెళ్లూరు పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.


మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు



త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

అమలాపురం టౌన్, జూన్ 5: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేగా అయితాబత్తుల ఆనందరావు ఘన విజయం సాధించాలని కోరుకుంటూ బండారులంక శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలోని వినాయకునికి మొక్కుకుని గతంలోనే పూజలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఘన విజయం సాధించడంతో మాజీ జడ్పీటీసీ చింతా శంకర మూర్తి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో స్వామివారికి బుధవారం 1,116 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు, గోళ్ల మల్లేశ్వరరావు, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, మాడా మాధవి, బండి సుబ్బారావు, మాజీ సర్పంచ్ చొల్లంగి సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

యానాం చేరుకున్న పుదుచ్చేరి సీఎం బృందం



విశాఖపట్నం చేరుకున్న సీఎం తదితరులు

యానాం, జూన్ 5: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతనిధి మల్లాడి కృష్ణారావు 61వ పుట్టిన రోజు వేడుకలు గురువారం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో స్థానిక యర్రా గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈవేడుకుల్లో పాల్గొనేందుకు సీఎం ఎన్.రంగస్వామి, హోంమంత్రి నమశ్శివాయ, స్పీకర్ సెల్వం, ప్రజాపనులశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు బుధవారం రాత్రి యానాం రిసార్ట్‌కు చేరుకున్నారు. వీరికి మల్లాడి కృష్ణారావు, పలువురు నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:గంగం గణేశా
శ్రీలలిత	: హిట్‌లిస్ట్
శేఖర్ స్ర్కీన్-1	: రాజు యాదవ్
శేఖర్ స్ర్కీన్-2	: ఆ ఒక్కటీ అడక్కు
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: భజే వాయువేగం
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: లవ్ మీ

దాట్ల సుబ్బరాజును కలిసిన కోడికత్తి శ్రీనివాస్



ముమ్మిడివరం, జూన్5: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా ఘన విజయం సాధించిన దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు)ను బుధవారం జనిపల్లి శ్రీనివాస్(కోడికత్తి శ్రీను), అతని సోదరుడు సుబ్బరాజు మురమళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నీతివంతమైన పాలన, అభివృద్ధిని చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

మండపేట, జూన్ 5: ఏపీకి ప్రత్యేకహోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇండియా కూటమిలో కలిసేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని కామన చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కె.విసుబ్బారావు, మగ్గం జాకబ్, రాజబాబు, వల్లబదాసు వీరవెంకటసత్యనారాయణ, కామన ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

డేవిడ్‌వార్నర్ బ్యాట్ అందుకున్న లూటుకుర్రు కుర్రాడు



మామిడికుదురు, జూన్ 5: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డేవిడ్‌వార్నర్ ఉపయోగించిన క్రికెట్ బ్యాట్‌ను మామిడికుదురు మండలంలో లూటుకుర్రు గ్రామానికి దుర్గాశ్రీహాస్ అందుకున్నాడు. ఈదరాడ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి శ్రీహాస్ కొంత కాలంగా డేవిడ్‌వార్నర్ ఇన్‌స్టాగ్రామ్ పేజీని ఫాలో అవుతున్నాడు. ఇటీవల వార్నర్ పెట్టిన ఒక ఈవెంట్‌లో తన ఇన్‌స్టా ఐడీ లక్కీడిప్‌లో ఎంపిక కావడంతో వార్నర్ ఆడిన క్రికెట్ బ్యాట్‌ను తనకు పంపించారని, దానిని బుధవారం అందుకున్నట్టు విద్యార్థి తెలిపాడు.

పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన పాలూరి

కొత్తపేట, జూన్ 5: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ విజేత దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాశ్‌నారాయణ, బీజేపీ జిల్లా కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, కోటిపల్లి దామోదర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

మామిడికుదురు, జూన్ 5: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భీమ్ విజ్ఞాన కేంద్రం ద్వారా నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. 20రోజులు విద్యార్థులకు పలు రకాల సబ్జెక్ట్‌లో ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణా తరగతులు విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడతాయని సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు తెలిపారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు గుర్తింపు పత్రాలను అందించారు. కార్యక్రమంలో భూపతి మనోహర్‌రాజు, కారుపల్లి కల్యాణ్‌బాబు, నేల శ్రీనివాసరావు, భూపతి వెంకటపతి, నీతిపూడి చంద్రరావు, బత్తుల రమేష్‌బాబు, బయ్యా మోహనరావు, గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పి.గన్నవరం, జూన్ 5: భారీ మెజార్టీ అందించి ఘన విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ అభినం దనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బుధవారం ఆయన జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షుడు పవన్‌కల్యా ణ్‌ను కలిశారు. ఈసందర్భంగా ఫోన్‌లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యలను దశలువారీగా పరిష్కరిస్తానన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. తన విజయానికి కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హరీష్‌మాధుర్‌కు అభినందనల వెల్లువ



అమలాపురం టౌన్, జూన్ 5: అమలాపురం ఎంపీగా ఘన విజయం సాధించిన గంటి హరీష్‌మాధుర్‌ను బుధవారం జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూలమాలలువేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు యెండూరి సీత-చంటి దంపతులు, మాజీ ఎంపీపీ చిప్పల యామినిపద్మప్రియ-నరేష్‌కుమార్ దంపతులతో పాటు కోలా నరసింహస్వామి, వై.చంద్రశేఖర్, సి.వెంకటరమణమూర్తి తదితరులు సత్కరించారు. టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకాగ్రత పెంచే కథా పఠనం

ఉప్పలగుప్తం, జూన్ 5: కథలు చదవడం వల్ల విద్యార్థుల్లో మానసిక ఏకాగ్రత పెరుగుతుందని కవి నల్లా నరసింహామూర్తి అన్నారు. భీమనపల్లి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం కథలు చదవడం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కడలి శ్రీనివాసరావు, మెండి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణకు అభినందనలు



కపిలేశ్వరపురం, జూన్ 5: ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావు విజయానికి కష్టించి పనిచేసిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణను బుధవారం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, కూటమి శ్రేణులు వల్లూరులోసన్మానించి అభినందించారు. కూటమికి ఇంతటి అపూర్వమైన మద్దతు ఇచ్చిన రాష్ట్రప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రెబల్ స్టార్ కృష్ణంరాజు సతీమణి పూజలు



ఆత్రేయపురం, జూన్ 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని రెబల్ స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి బుధవారం దర్శించుకున్నారు. తొలుత ఏడు ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,80,977 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

17 మంది రక్త దానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 5: స్థానిక ఏరియా ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంకులో రామచంద్రపురం పశుసంవర్థక ఆసుపత్రి వెటర్నరీ వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. వీరిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు తొగరు మూర్తి అభినందించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. 17మందిపై కేసులు

ముమ్మిడివరం, జూన్ 5: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో లంకాఫ్ ఠాణేలంకలో ఇరువర్గాల మధ్య విభేదాలు చోటు చేసుకోవడంతో రెండు వర్గాలకు చెందిన 17మందిపై కేసులు నమోదుచేశారు. వైసీపీ ఓటమి పాలవడంతో ఆ గ్రామానికి చెందిన కూటమి మద్దతుదారులు కొప్పిశెట్టి సత్యానందం, కొప్పిశెట్టి మణి రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవం సంబరాలు చేసుకుంటున్నారు. అయితే అక్కడే ఉన్న కొక్కిరికడ్డ సత్తిబాబుకు వారికి మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారితీసింది. దీంతో రెండు వర్గాలకు చెందినవారు ఘర్షణకు దిగడంతో కొక్కిరిగడ్డ సత్తిబాబు వర్గానికి చెందిన ఎనిమిది మందిపైనా, కొప్పిశెట్టి సత్యానందం వర్గానికి చెందిన తొమ్మిది మందిపైనా కేసులు నమోదుచేసి గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్టు ఎస్‌హెచ్‌వో జి.భైరవస్వామి తెలిపారు.

డ్వాక్రా మహిళను మోసం చేసిన యువకుడు



బ్యాంక్ సీసీ పుటేజీలో సేకరించిన వ్యక్తి ఫొటో

ఆలమూరు, జూన్5: బ్యాంకుకు డ్వాక్రాలోన్ కట్టడానికి వచ్చిన మహిళ అక్కడున్న యువకుడి చేతిలో మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలమూరు యూనియన్ బ్యాంకులో డ్వాక్రా రుణం తీసుకున్న జొన్నాడకు చెందిన ఒక గ్రూపు మహిళ కె.కనకమహాలక్ష్మి నగదు చెల్లించడానికి మే15నబ్యాంకుకు వచ్చింది. ఓచరు రాయడం రాక అక్కడ ఉన్న ఒక యువకుడిని అడిగితే ఓచరు రాసి నగదు కౌంటర్లో చెల్లిస్తానని చెప్పి రూ.33వేలు తీసుకున్నాడు. కౌంటర్‌వద్దకు వెళ్లి వచ్చి కౌంటర్‌స్లిప్ ఆమెకు ఇవ్వగా ఇంటికి చేరింది. రుణం చెల్లించలేని బ్యాంకు అధికారులు జొన్నాడలోని డ్వాక్రా సంఘానికి సమాచారం ఇవ్వడంతో మంగళవారం వారు వచ్చి మే15నే చెల్లించామని కౌంటర్‌స్లిప్ చూపించారు. అయితే ఇది బ్యాంకులో చెల్లించలేదని చెప్పడంతో కనకమహాలక్ష్మి లబోదిబోమంది. బ్యాంకు అధికారులు సీసీ ఫుటేజీలను చూపిస్తే ఆమె తనను మోసం చేసిన యువకుడిని గుర్తించింది. యువకుడి ఫొటో ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆమె చెప్పింది.

పవన్‌ను కలిసేందుకు వెళ్లిన దేవ

మలికిపురం, జూన్ 5: రాజోలు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన దేవ వరప్రసాద్ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు మంగళగిరి వెళ్లారు. అఖండ విజయం చేకూర్చిన నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐ.పోలవరం మండలాన్ని వరించిన ఎమ్మెల్యే పదవి

ముమ్మిడివరం, జూన్ 5: ముమ్మిడివరం అసెంబ్లీ ఎన్నికల్లో ఐ.పోలవరం మండలాన్ని ఆరుసార్లు ఎమ్మెల్యే పదవి వరించింది. 1955నుంచి ఇప్పటి వరకు ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన 15సాధారణ, రెండు సార్లు జరిగిన ఉపఎన్నికల్లో ఏడు సార్లు ఐ.పోలవరం మండలాన్ని, నాలుగు సార్లు ముమ్మిడివరం మండలాన్ని, నాలుగుసార్లు కాట్రేనికోన మండలాన్ని ఎమ్మెల్యే పదవి వరించింది. 1962, 1972లలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన పళ్ల వెంకట్రావుది ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి చింతలపాటి బుచ్చికృష్ణంరాజుది ఐ.పోలవరం. 1978లో విజయం సాధించిన మోకా విష్ణుప్రసాదరావుది కాట్రేనికోన మండలం రామస్వామితోట. 1985లో విజయం సాధించిన పండు కృష్ణమూర్తిది ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి. 1996లో సాధించిన జీఎంసీ బాలయోగిది ఐ.పోలవరం మండలం ఎదుర్లంక రామాలయంపేట కాగా, 1998-99లలో విజయం సాధించిన చెల్లి వివేకానందది ఐ.పోలవరం మండలం పాత ఇంజరం. 2004లో విజయం సాధించిన పినిపే విశ్వరూప్ ది కాట్రేనికోన మండలం నడవపల్లి. 2009-2019లలో విజయం సాధించిన పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌ది ముమ్మిడివరం మండలం అయినాపురం కాగా, 2014.2024లలో విజయం సాధించిన దాట్ల సుబ్బరాజు ది ఐ.పోలవరం మండలం మురమళ్ల.